

నత్తే నయం..!

నత్తనడకన గిలకలదిండి హార్బర్ నిర్మాణం



గిలకలదిండి హార్బర్ వద్ద భవనాలు నిర్మించాల్సిన ప్రాంతం

- ఉత్తర, దక్షిణ బ్రేక్ వాటర్ పనుల నిలిపివేత
- పోర్టు నిర్మాణ పనులకు తరలిన డ్రెడ్జర్లు
- బిల్లులు మంజూరు చేయని గత వైసీపీ ప్రభుత్వం
- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- కేంద్ర ప్రభుత్వ నిధులతో సరిపెట్టి మమ..
- మరో ఏడాదికైనా పూర్తయ్యేనో లేదో..!

గిలకలదిండి హార్బర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రూ.348 కోట్ల అంచనాతో 2021లో ప్రారంభించిన ఈ పనులకు గత ప్రభుత్వం నిధుల కొరత సృష్టించింది. 65 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా.. నిధుల కొరత కారణంగా చాలా భాగం పనులు పెండింగ్‌లోనే ఉండటంతో ఇప్పట్లో ఈ హార్బర్ అందుబాటులోకి వచ్చే సూచనలు కనిపించట్లేదు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గిలకలదిండి హార్బర్‌లోని ఉత్తర, దక్షిణ బ్రేక్ వాటర్‌ల నిర్మాణ పనులకు సంబంధించి సముద్రంలో వేసిన కొండరాళ్ల భూమిలోకి కుంగిపోతున్నాయనే సాంకేతిక కారణాలు చూపి కొంతకాలంగా పనులు నిలిపివేశారు. ఇవి మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి. హార్బర్ వద్ద ఆక్షన్ హాల్, మత్స్యకారుల వలలు భద్రపరుచుకునే గదులు, విశ్రాంతి గదులు, ఐస్‌ప్లాంట్ వంటి భవనాల నిర్మాణ పనులు పునాదుల దశను దాటలేదు. గత ఏడాది డిసెంబరు నాటికే ఈ పనులు పూర్తిచేయాల్సి ఉన్నా నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

కేంద్రప్రభుత్వ నిధుల వరకు ఖర్చు చేసి..

గిలకలదిండి హార్బర్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మేర నిధులను ఖర్చు చేయాల్సి ఉంది. సముద్ర ముఖద్వారం వద్ద కీలకమైన డ్రెడ్జింగ్ పనులను అసంపూర్తిగానే చేశారు. ఇక్కడి డ్రెడ్జర్లను ఇటీవల బందరు పోర్టు పనులకు తరలించడంతో ఈ పనులు దాదాపు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులను ఈ హార్బర్ అభివృద్ధి పనుల కోసం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులను విడుదల చేయకుండా జాప్యం చేశారు. ఫలితంగా ఈ పనులు వేగవంతంగా జరగలేదు. గత ఏడాది మార్చిలోనే కాంట్రాక్టు సంస్థ రూ.120 కోట్ల మేర బిల్లులు పెట్టగా, మంజూరు చేయలేదు. దీంతో బిల్లులు ఇచ్చే వరకు పనులు చేయమని కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌లు పనులు నిలిపివేశారు. కొంతమేర బిల్లులు మంజూరుచేసినా ప్రస్తుతం పనులు ఆశించిన మేర జరగట్లేదు. కడప జిల్లాకు చెందిన ఎంఆర్‌కేఆర్ సంస్థకు ఈ పనులను అప్పగించగా, ఆ సంస్థ కేఎస్ఆర్ అనే మరో సంస్థకు సబ్ కాంట్రాక్టు ఇచ్చిందని అధికారులు చెబుతున్నారు. హార్బర్ వద్ద 28 భవనాల నిర్మాణం జరగాల్సి ఉండగా, పునాదుల దశ కూడా దాటలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పనులు ఎంతమేర ముందుకు సాగుతాయనేది ప్రశ్నగా మారింది.

పూడిక పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..

గిలకలదిండి హార్బర్ నుంచి 90 సోనాబోట్లు, 718 మోటరైజ్‌డ్ బోట్లు సముద్రంలో చేపల వేటను సాగిస్తున్నాయి. ఏడాదికి 1.50 లక్షల టన్నుల చేపలు, రొయ్యలను ఈ హార్బర్ ద్వారా దేశవిదేశాలకు మత్స్యసంపదను ఎగుమతి చేస్తూ ఉంటారు. హార్బర్ నుంచి తూర్పు దిశగా బోట్ల రాకపోకలు సాగించే ప్రధానకాల్వ ఉంటుంది. అలలు ఉత్తర దిశగా ఎగసిపడటంతో సముద్ర ముఖద్వారం నిత్యం ఇసుకతో పూడుకుపోతోంది. సముద్రపు పోటు వచ్చే సమయంలోనే బోట్లు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. సముద్ర ముఖద్వారం వద్ద ఒకచోట రెండు అడుగుల లోతు ఉంటే, మరోచోట 10 అడుగుల లోతున నీరు ఉంటోంది. దీంతో బోట్లు ఇసుక మేట వేసిన ప్రాంతంలో చిక్కుకుపోయి అలల తాకిడికి ధ్వంసమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారులు, బోటు యజమానులు ఎన్నో ఏళ్లుగా సముద్ర ముఖద్వారం వద్ద మేటను శాశ్వత పద్ధతిలో తొలగించాలని కోరుతున్నారు. ఎట్టకేలకు సముద్ర ముఖద్వారం పూడుకుపోకుండా రూ.348 కోట్ల అంచనాతో పనులకు రూపకల్పన చేశారు. 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను డ్రెడ్జింగ్ చేసి, ముఖద్వారం వద్ద 14 అడుగుల లోతు ఉండేలా చూడాలని నిర్ణయించారు. సముద్రం దక్షిణం వైపున 1249 మీటర్లు, ఉత్తరం వైపున 1150 మీటర్ల మేర బ్రేక్ వాటర్‌ను నిర్మించాలని నిర్ణయించారు. అయితే, ఈ బ్రేక్ వాటర్ నిర్మాణం ఏడాదిగా చేయకుండా నిలిపివేశారు. ఈ బ్రేక్ వాటర్‌లు నిర్మిస్తే 50 ఏళ్ల వరకు గిలకలదిండి హార్బర్ వద్ద సముద్ర ముఖద్వారం పూడుకుపోకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఈ పనులను పూర్తి చేయించేందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు, బోటు యజమానులు కోరుతున్నారు.



శివాలయంలో పునఃనిర్మాణ పనులు (ఇన్‌సెట్‌లో) ఆలయంలోని కార్యాలయంలో మద్యం సీసాలు

ఆలయంలో అపచారం

గుడివాడ శ్రీభీమేశ్వరాలయంలో మద్యం సీసాలు

- పూటుగా తాగి సీసాలు వదిలివెళ్లిన మందుబాబులు
- ఆలయ పునఃనిర్మాణ పనుల్లో కనిపించని భద్రత
- రాత్రివేళల్లో లోపలికి వస్తున్న ఆకతాయిలు

గుడివాడ, జూన్ 29 : స్థానిక శ్రీభీమేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో అపచారం జరిగింది. పవిత్రమైన ఆలయంలో మద్యపానం జరిగింది. ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా ఇక్కడ ప్రస్తుతం అర్చకులకు క్వార్టర్లు నిర్మిస్తున్నారు. తలుపులు బిగించాల్సి ఉంది. అయితే, మెటీరియల్ తీసుకొచ్చే లారీల రాకపోకలకు అడ్డుగా ఉండటంతో ఆలయ ప్రహరీ తొలగించారు. దీంతో రాత్రి సమయాల్లో మందుబాబులు ఆలయ ఆవరణలోకి యథేచ్ఛగా ప్రవేశిస్తున్నారు. అక్కడే మద్యం సేవించి సీసాలు వదిలి వెళ్లిపోతున్నారు. ఆ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నారు. భక్తులు పూజలు నిర్వహించే చోట మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. ఈ విషయం ఆలయ అధికారులకు తెలిసి కూడా అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని, ఓ అధికారి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి భద్రత లేకపోవడం వల్లే ఇలాంటి అపచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కర్రలతో రక్షణ గోడ కట్టాం..

పెద్ద శివాలయంలో పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయి. అర్చకుల క్వార్టర్ల నిర్మాణం పూర్తై తలుపులు బిగించాల్సి ఉంది. ఆ క్వార్టర్‌లో ఆకతాయిలు మద్యం సీసాలను వదిలివెళ్లిన విషయం నా దృష్టికొచ్చింది. లారీల రాకపోకల నిమిత్తం ప్రహరీని కొంతమేర తొలగించాం. వెంటనే కర్రలతో రక్షణ గోడ కట్టాం.

- నటరాజన్ షణ్ముగం, ఆలయ ఈవో

మదర్సా ఘటనపై 'ఎన్టీఆర్' కలెక్టర్ ఆరా

కేసును వేగవంతం చేసిన పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

- పిల్లలను తీసుకెళ్లిపోయిన తల్లిదండ్రులు
- ఖాళీ అయిన అజిత్‌సింగ్‌నగర్‌లోని మదర్సా
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు

6లో..

చెవిలో పువ్వు..!

చల్లపల్లి మండలంలో సదరం సర్టిఫికెట్ల మాయాజాలం

- బధిర లక్షణాలతో దివ్యాంగ సర్టిఫికెట్ల జారీ
- సామాజిక తనిఖీల్లో బయటపడ్డ దొంగ పింఛన్ల బాగోతం
- ఇప్పటి వరకు వెలుగుచూసిన 76 దొంగ పింఛన్లు
- తనిఖీలు ముమ్మరమైతే మరిన్ని బయటపడే అవకాశం



తవ్వేకొద్దీ దొంగ పింఛన్ల బాగోతాలు బయటపడుతున్నాయి. దివ్యాంగులుగా దొంగ సర్టిఫికెట్లు పొంది, ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న కథలు చల్లపల్లి మండలంలో వెలుగుచూశాయి. ముఖ్యంగా బధిర లక్షణాలతో సదరం సర్టిఫికెట్ పొందిన విషయం డీఆర్పీల తనిఖీల్లో వెలుగుచూసింది.

చల్లపల్లి, జూన్ 29 : ఉపాధి హామీ పథకం డీఆర్పీలు గ్రామాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో దొంగ పింఛన్ల బాగోతాలు బయటపడుతున్నాయి. వీటిల్లో దివ్యాంగుల పింఛన్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. చెవుడు లేకున్నా.. బధిర లక్షణాలతో సదరం సర్టిఫికెట్లు పొంది పింఛన్లు మంజూరు చేయించుకున్నారు. డీఆర్పీల విచారణలో సంబంధిత లబ్ధిదారులకు ఆ లోపాలు లేనట్టుగా నిర్ధారణైంది. చల్లపల్లి మండలంలోని 10 సచివాలయాల పరిధిలో మొత్తం 76 పింఛన్లలో అవకతవకలు జరగ్గా, వీటిలో 44 దివ్యాంగ పింఛన్లే కావడం గమనార్హం. అందులోనూ బధిర కేటగిరీలో తీసుకున్నవే అధికం.

ఇలా బయటపడింది..

సాధారణ తనిఖీల్లో భాగంగా డీఆర్పీలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల కోసం వెళ్లిన వీరు.. ఆ విషయం చెప్పకుండా, లబ్ధిదారులతో సాధారణంగా మాట్లాడుతూ లోపాలు ఉన్నాయో లేదో ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే దొంగ లబ్ధిదారులను గుర్తించారు. ఈ మేరకు డీఆర్పీలు నివేదిక సిద్ధం చేస్తున్నారు. వివరాలను సెర్ప్‌కు, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

గ్రామాలవారీగా ఇలా..

గ్రామాలవారీగా పింఛన్లలో అవకతవకలు ఇలా ఉన్నాయి. మొత్తం 76 పింఛన్లలో తేడాలు గుర్తించగా, వీటిలో 44.. బధిర లక్షణాలతో సదరం సర్టిఫికెట్లు పొందినవారివే. ఇవన్నీ గత ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్లు పొంది, పింఛన్ మంజూరు చేయించుకున్న వారివే. వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫారసులతో ఇతర కేటగిరీల పింఛన్లు సైతం మంజూరు చేయించారు. చల్లపల్లి మండలంలోని మంగళాపురంలో అత్యధికంగా 19 మంది బధిర లక్షణాలతో దివ్యాంగ పింఛన్లు పొందుతున్నట్లు విచారణలో నిర్ధారణైంది. ఆముదార్లంకలో ఒకరు బధిర లక్షణాలతో, మరొకరు కాలు విరిగిందని సర్టిఫికెట్ పొంది పింఛన్ తీసుకుంటున్నారు. పాగోలులో ఇద్దరు, మాజేరులో 15 మంది బధిర లక్షణాలతో, ఒకరు వెన్నుపూస నొప్పి అని, యార్లగడ్డలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీ పక్షవాతం ఉన్నట్లు దివ్యాంగ పింఛన్ పొందుతున్నట్టు తెలుసుకున్నారు. లక్ష్మీపురంలో ఐదుగురు, చల్లపల్లిలో ఇద్దరు బధిర లక్షణాలతో, ఒకరు దృష్టిలోపం కారణం చూపి దివ్యాంగ సర్టిఫికెట్ పొంది, పింఛన్లు మంజూరు చేయించుకున్నారు. చర్మకారులు కానివారు కూడా పింఛన్లు పొందిన ఉదంతాలు బయటపడ్డాయి. రెండో వివాహం చేసుకున్నప్పటికీ వితంతు పింఛన్లు తీసుకున్నవారు కూడా అధికంగానే ఉన్నారు. ఇటీవల మరణించిన వారికి సైతం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడం గమనార్హం. వేర్వేరు కారణాలతో పింఛన్లు పొందటం ఒక ఎత్తయితే, అత్యధికంగా దివ్యాంగ పింఛన్లు, అందులోనూ బధిర లక్షణాలతో పింఛన్లు పొందటం చూస్తే సదరం సర్టిఫికెట్ల మంజూరుకు ఎంత గిరాకీ ఉందో అర్థమవుతుంది. ప్రతి గ్రామంలో తనిఖీలు చేపడితే మరిన్ని దొంగ పింఛన్లు బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంటికే రేషన్

వీధుల్లో వాహనాలు పెట్టి ఇచ్చే పద్ధతికి చెల్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిత్యావసరాలను ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటివరకు అస్తవ్యస్తంగా ఉన్న డోర్ టు డోర్ పంపిణీ విధానాన్ని ప్రతి గడపకు చేర్చేలా చర్యలు తీసుకుంది. సోమవారం నుంచి ప్రతి గడప తొక్కి నిత్యావసరాలు ఇవ్వాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించింది. జూలై 1 నుంచి 20వ తేదీ వరకు యథావిధిగా ఎండీయూ ఆపరేటర్లే నిత్యావసరాలను పంపిణీ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీని చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఎండీయూ ఆపరేటర్లు తాము ఎంపిక చేసిన వీధుల్లో వాహనాన్ని పార్కింగ్ చేసి బియ్యాన్ని పంపిణీ చేసేవారు. ఇంటి వద్దకు వచ్చి బియ్యం ఇచ్చింది లేదు. అలాగే, ఉదయాన్నే కాకుండా, అందరూ పనులకు వెళ్లిన సమయంలో ఎండీయూ ఆపరేటర్లు రావటంతో చాలామంది రేషన్ అందుకోలేని పరిస్థితి ఉండేది. ఇన్ని సమస్యలున్న ఈ విధానంపై ప్రభుత్వం త్వరలో సమీక్షించనుంది. ప్రస్తుతానికి సోమవారం నుంచి డోర్ టు డోర్ విధానాన్ని నూరుశాతం అమలు చేసేలా సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు.. జిల్లాస్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చింది. గతంలోలా ఏదో ఒక బజారులో వాహనాన్ని పెట్టి బియ్యం ఇవ్వటం కాకుండా, ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యం అందించాలని స్పష్టం చేసింది.

ఇక బంగారు మల్లన్న



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువైన బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జటాఝూటం, నాగపడగ, పానవట్టం, ధారపాత్ర, మకరతోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావుకు అందజేశారు.



గొల్లపూడిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గోదామును పరిశీలిస్తున్న సీఈవో ముఖేశ్ కుమార్ మీనా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ఈవీఎంలు, వీవీ ప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూన్ 29: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం), వీవీ ప్యాట్లు ఉంచిన గోదాముకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం గొల్లపూడిలోని ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన గోదామును రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా, సమన్వయ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు గోదామును క్షుణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలకోసారి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు. వర్షాకాలం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, వై.రామయ్య(టీడీపీ), వై.అంజనేయరెడ్డి, ఎల్.శివరామ్‌ప్రసాద్(వైసీపీ), బి.కిరణ్ (ఐఎన్‌సీ), వై.కృష్ణకిషోర్ (నవతరంపార్టీ) పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 29: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గాన ద్వారకాతిరుమల వెళుతూ అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్, ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. నూజివీడు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి సన్నిధిలో జస్టిస్ వెంకటజ్యోతిర్మయి దంపతులు

ఎన్‌హెచ్ పెండింగ్ పనులపై చంద్రబాబుకు నివేదిక

వన్‌టౌన్, జూన్ 29: విజయవాడ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారుల పెండింగ్ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివేదిక ఇచ్చారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేశ్‌తో పాటు చంద్రబాబును చిన్ని కలిశారు. ఢిల్లీలో జాతీయ రహదారుల విభాగం, జాతీయ రోడ్డు రవాణా మంత్రిత్వశాఖల ద్వారా సేకరించిన పెండింగు పనుల వివరాలను నివేదిక రూపంలో అందించానని తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెండింగ్ పనుల వివరాలు తెలుపుతున్న ఎంపీ కేశినేని చిన్ని

రైతు సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు

▸ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో ఏపీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, జూన్ 29: రైతు సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతు ఉద్యమాలు కొనసాగుతాయని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు స్పష్టంచేశారు. సమితి సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు ద్రోహం చేసిన బీజేపీ సంఖ్యాబలం తగ్గడానికి 14 నెలల రైతు ఉద్యమమే కారణమన్నారు. ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీల సహకారం లేకుండా కేంద్ర ప్రభుత్వ మనుగడ సాగదన్నారు. రాహుల్‌గాంధీ జోడోయాత్ర వల్ల కాంగ్రెస్‌పార్టీకి పార్లమెంట్‌లో సభ్యుల సంఖ్య పెరిగిందన్నారు. జూలై 10న ఢిల్లీలో నిర్వహించే సంయుక్త మోర్చా అనుబంధ రైతు సంఘాల ప్రతినిధులందరూ విస్తృతస్థాయి సమావేశానికి హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా చేయించాలని రైతు సంఘం సీనియర్ నేత కేశవరావు డిమాండ్ చేశారు. రైతు నేతలు కేవీవీ ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, ఎం.కృష్ణయ్య, చుండూరు రంగారావు, కొల్లా రాజమోహన్, గోపాలకృష్ణయ్య, కూర ప్రసాద్, హరినాథ్, అక్కినేని భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతు నేతలు అతుల్‌కుమార్ అంజన్, యెర్నేని నాగేంద్రబాబు, మాజీ మంత్రి యేర్నేని సీతాదేవి, పత్రికా సంపాదకుడు చెరుకూరి రామోజీరావు చిత్రపటాలకు నేతలు నివాళులర్పించారు.

ముగిసిన పీఏసీఎస్ ఈవోల శిక్షణ

వన్‌టౌన్, జూన్ 29: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను డిజిటలీకరించి ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కేంద్ర సహకార శాఖ నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. శనివారం కేబీఎన్ కళాశాలలో ఎన్టీఆర్ జిల్లాలోని 58 మంది కార్యనిర్వాహణాధికారులకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డ్ సంయుక్త సహకారంతో సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చేందుకు శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ పోర్టల్ ద్వారా ప్రభుత్వపరంగా అందించే సేవలు, బ్యాంకింగ్, బీమా ఆన్‌లైన్ సర్వీస్‌లు అందుతాయన్నారు. 32 కేంద్ర ప్రభుత్వ సేవలు, 174 రాష్ట్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. రెండు రోజుల శిక్షణలో 116 పీఏసీఎస్‌ల కార్యనిర్వాహణాధికారులు పాల్గొన్నారని తెలిపారు. పోర్టల్ లోని వివిధ సేవలనుపై ఏపీ సీఎస్‌సీ రాజాబాబు వివరించారు.

కృష్ణా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశా

▸ ప్రభుత్వం రాజీనామా ఆమోదించేంత వరకు వీసీగా కొనసాగుతా జి.జ్ఞానమణి

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ వీసీగా తాను పనిచేసిన ఏడాదిలో యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులు చేసినట్టు వీసీ జి.జ్ఞానమణి తెలిపారు. యూనివర్సిటీ సెనెట్‌హాలులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వీసీ పదవికి రాజీనామా చేశానని, రాజీనామాను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉందని, అప్పటివరకు వీసీగా కొనసాగుతానని ఆయన తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో, నూజివీడు పీజీ సెంటరులో భవనాల నిర్మాణానికి ఈ ఏడాదికాలంగా కృషి చేశానని తెలిపారు. యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాల భవనాలు, యూనివర్సిటీ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టామని, ఈ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాదిలో యూనివర్సిటీ ద్వారా క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించి 250మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుని ఐదుగురు విద్యార్థులకు విదేశాల్లో ఉన్నతవిద్య చదివేందుకు అవకాశం కల్పించామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో యూనివర్సిటీలో కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభించలేకపోయామన్నారు. వచ్చే జూలైలో యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ జ్ఞానమణి

రూ. 3వేల నుంచి రూ.4 వేలకు పింఛన్ పెంచి

మాట నిలబెట్టుకున్నాం

రేపు లబ్ధిదారులకు రూ.7వేలు అందిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 29: పింఛన్ సొమ్మును రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని, ఆ సొమ్మును మునుపటి నెలల బకాయిలతో కలిపి రూ.7 వేల చొప్పున జూలై 1న ఉదయం 6 గంటలకే సచివాలయ కార్యదర్శులు ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మంత్రి మాట్లాడారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 31,068 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. గతంలో మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.9.31 కోట్లు పంపిణీ చేయగా, ప్రస్తుతం పెంచిన పింఛనుతో కలిపి రూ.21 కోట్లకు పైగా పంపిణీ చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో మచిలీపట్నాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఇన్‌చార్జి డీఆర్డీయే పీడీ, డీపీవో నాగేశ్వర నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణాజిల్లాలో 2,42,341 మందికి ఇంటి వద్దకే పింఛన్లు

▸ రూ.162.42 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు చేశాం: కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): "కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 2,42,321 మందికి జూలై 1న ఇంటివద్దకే సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో రూ.162.42 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జూలై 1వ తేదీన ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తారు. ధ్రువీకరణపత్రాలు, ముఖ్యమంత్రిలేఖను పింఛనుతోపాటు అందిస్తారు." అని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక పింఛన్ల పంపిణీపై ఆయన సమీక్ష నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి నూతనంగా రూపొందించిన మొబైల్‌యాప్‌ను అధికారులు, సచివాలయ సిబ్బంది ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ పరికరాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే బ్యాంకులనుంచి 70శాతం నగదును డ్రా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన

▸ సమస్యలపై కొల్లు రవీంద్రకు 300 అర్జీలు

▸ పరిష్కరిస్తామని మంత్రి హామీ

మచిలీపట్నం టౌన్, జూన్ 29: టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మంత్రి కొల్లు రవీంద్రకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. టిడ్కో ఇళ్లు మంజూరు చేసినా ఐదేళ్లుగా ఇళ్లు చూపలేదని లబ్ధిదారులు మంత్రికి మొరపెట్టుకున్నారు. పింఛన్లు అందడం లేదని కొందరు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నా ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదని మరికొందరు వినతిపత్రాలిచ్చారు. వివిధ డివిజన్లు, గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమకు ప్రభుత్వ పథకాల నగదు బ్యాంకుల్లో జమ కావడం లేదని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు పల్లపు భూముల్లో ఉన్నాయని అధిక సంఖ్యలో వినతులిచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్‌లు అందడం లేదని కొందరు విద్యార్థులు ఏకరువు పెట్టారు. పోతేపల్లి, హస్సేన్‌పాలెం గ్రామాల్లో లో ఓల్టేజీ, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేయాలని మరికొందరు అర్జీలు ఇచ్చారు. దాదాపు 300 అర్జీలు కొల్లు రవీంద్రకు అందించారు. "ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపుతాం. సమస్యలు పరిష్కారమయ్యేందుకు సమీక్ష చేస్తా." అని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, గోపు సత్యనారాయణ, చిత్తజల్లు నాగరాము పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న కొల్లు రవీంద్ర



టీడీపీ నేతలంతా

ఎంపీ కేశినేని చిన్నిని సత్కరిస్తున్న బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీను

ఒకే మాట, బాటగా నడుస్తాం

సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం: ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 29: "టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న చిత్తశుద్ధితో పని చేసే నాయకుడు. నాకు, బుద్దా వెంకన్నకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు. నాగుల్ మీరా, బుద్దా వెంకన్న ఎనికల్లో నాకు పూర్తి సహకారం అందించారు. అండగా నిలిచారు. ఇక నుంచి నగరంలో ఉన్న టీడీపీ నాయకులమంతా ఒకే మాట, ఒకే బాటగా నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం." అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుద్దా వెంకన్న నివాసంలో శనివారం కేశినేని చిన్నికి సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రథం సెంటర్ నుంచి తన కార్యాలయం వరకు ఓపెన్ టాప్ జీప్‌పై చిన్నిని భారీ ర్యాలీతో వెంకన్న తీసుకొచ్చారు. నాయకులు నాగుల్‌మీరా, చెన్నుపాటి శ్రీను, పట్టాభిరామ్‌తో కలిసి ఎంపీని సత్కరించారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీనుకు కూడా పదవులు దక్కేలా కృషి చేస్తానని చిన్ని హామీ ఇచ్చారు. విజయవాడ టీం టీడీపీకి కేశినేని చిన్నిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), నాయకులు కాండ్రేగుల రవీంద్ర, పేరాబత్తుల రమణ, కామదేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఈగల సాంబ, నందకుమారి, తుపాకుల రమణమ్మ, పత్తి నాగేశ్వరరావు, మైలవరపు వీరబాబు, గుర్రం కొండా, గంగాధర్ రెడ్డి, కుంచం దుర్గారావు, వల్లభనేని ప్రసన్నలక్ష్మి, పితాని పద్మ, షేక్ అమానుల్లా, బడుగు వెంకన్న, శివాజీ పాల్గొన్నారు.

చిన్ని సారథ్యంలో నడుస్తాం: బుద్దా వెంకన్న

"కేశినేని చిన్ని అంకితభావం గల నాయకుడు. మరో రెండుసార్లు విజయవాడ ఎంపీగా ఆయన ఎన్నికవుతారు. మూడోసారి ప్రమాణస్వీకారం చేసేంతవరకు ఆయన వెంట ఉంటా. కేశినేని నాని ఎంపీగా ఎన్నికయ్యాక చంద్రబాబుపై వ్యాఖ్యలు చేశారు. అందువల్లే ఆయనను వ్యతిరేకించా. ఇప్పుడు మేమంతా చిన్ని సారథ్యంలో నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని నాయకులందరం చిన్నితోనే ఉంటాం. చిన్నిపై అనవసరంగా ఎవరైనా నోరు పారేసుకుంటే అక్కడ నుంచే మా పోరాటం ప్రారంభిస్తాం" అని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

మదర్సా ఘటనపై ఎన్టీఆర్ కలెక్టర్ ఆరా

▸ సృజన ఆదేశాలతో కేసును వేగవంతం చేసిన పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29: అజిత్‌సింగ్‌నగర్ మదర్సా ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆరా తీశారు. జరిగిన ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరిష్మా మృతి పట్ల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీసులు కేసును వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. కాగా మదర్సాలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో పాటుగా తెలంగాణకు చెందిన విద్యార్థినులు 60 మందికి పైగా ఉన్న విషయం తెలిసిందే. కరిష్మా అనుమానాస్పదంగా మృతిచెందడంతో మదర్సా నుంచి విద్యార్థినులను తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. దీంతో మదర్సా ఖాళీ అయిపోంది. మదర్సా నిర్వాహకుడు సయ్యద్ షాహీద్ పర్వీజ్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇప్పటికే మదర్సాలో నిల్వ ఉంచిన బీఫ్, మటన్ శాంపిల్స్‌ను ల్యాబ్ టెస్టింగ్‌కు అధికారులు పంపించారు. మదర్సాలో మొత్తం 60 మంది విద్యార్థులు ఉండగా కరిష్మాకు మాత్రమే ఫుడ్ పాయిజన్ కావడంపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసును మరింత వేగవంతం చేశారు.

కారు అడ్డుతీయమని హారన్ కొట్టినందుకు

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి

▸ ఇద్దరిపై కేసు

గుడివాడ: బస్సుకు అడ్డుగా ఉన్న కారును తీయమని హారన్ కొట్టినందుకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై ఇద్దరు దాడి చేశారు. ఈ ఘటన గుడివాడలో శనివారం జరిగింది. డ్రైవర్ ఫిర్యాదుపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. అవనిగడ్డ నుంచి గుడివాడకు ఏపీ 39 యూజే 6006 నెంబరు ఆర్టీసీ బస్సు వస్తుండగా స్థానిక హోటల్ అతిథి ఇన్ వద్ద ఏపీ 16డీజే 8010కారు అడ్డుగా ఉంది. కారును పక్కకు తీయాలని బస్సు డ్రైవర్ సిరిపెళ్ల రాకేష్ పలుమార్లు హారన్ కొట్టాడు. దీంతో ఫుల్లుగా మద్యం తాగి ఉన్న ఇద్దరు కారు నుంచి దిగి డ్రైవర్‌ను దుర్భాషలాడి, చెయ్యి చేసుకున్నారు. స్థానికులు గుమిగూడడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపో యారు. మళ్లీ వారు నేరుగా బస్టాండ్‌కు వెళ్లి బస్సు డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. రాకేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఎం.నాగ దుర్గారావు తెలిపారు. దాడికి పాల్పడిన వారి వివరాలు ఇంకా తెలియలేదు.



దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గుడివాడ ఆర్టీసీ డిపో వద్ద డిమాండ్ చేస్తున్న డ్రైవర్లు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: సీఐటీయూ

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిచేసి గాయపరచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్వీవీ రెడ్డి డిమాండ్ చేశారు. కారు అడ్డుగా ఉండటంతో డ్రైవర్ హారన్ కొట్టాడని, దీనికే ఇద్దరు నేరుగా బస్టాండ్‌లోకి వచ్చి దాడి చేశారని, రాష్ట్రంలో అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బస్సు డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.





ఉండవల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాకేజీలపై ప్రశ్నలు, గందరగోళం

▸ అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ రైతుల సమావేశం నేటికి వాయిదా

తాడేపల్లి టౌన్, జూన్ 29: సీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి గ్రామ సచివాలయం-2లో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశం గందరగోళానికి దారితీసింది. సమావేశం ప్రారంభం కాగానే ఓ రైతు భూములకు సంబంధించి వివరాలు తెలపాలని కోరారు. ఆదేవిధంగా ఎంత ప్యాకేజీ ఇస్తారు? ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తుండగా అక్కడే ఉన్న టీడీపీకి చెందిన రైతులు కలగజేసుకుని గత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ఏం చేశారంటూ నిలదీశారు. ఇప్పుడు వచ్చి ప్రశ్నిస్తున్నారని, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా మళ్లీ సర్వే ఎలా చేస్తారని కొందరు రైతులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెండున్నరేళ్లపాటు కనీసం కౌలు డబ్బులు కూడా ఇవ్వకపోతే ఎందుకు నిలదీయలేదని మరికొందరు రైతులు ప్రశ్నించారు. రాజధాని పేరుతో ధరలు పెరగడంతో భూములను రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని, అమరావతి కోసం ఏర్పాటు చేస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డుకు అడ్డుపడుతూ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తు న్నారని విమర్శించారు. రైతుల అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడ డంతో డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు సమావేశం అర్ధాంతరంగా నిలిపి వేశారు. ఆదివారం సాయంత్రం మరోసారి భేటీ అవుదామని రైతులకు తేల్చి చెప్పారు.

ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

▸ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఎఫ్ఏల సస్పెన్షన్

▸ ఏపీవో, టీఏలకు షోకాజ్‌లు: డ్వామా పీడీ సూర్యనారాయణ

చల్లపల్లి, జూన్ 29: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలని జిల్లా డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ సూచించారు. చల్లపల్లి మండల పరిషత్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామాల వారీగా తనిఖీ వివరాలను ఆయన పరిశీలించారు. తమ గ్రామంలో చెరువు తవ్వకం అసంపూర్తిగా చేశారని, ఉపాధి పథకం సిబ్బందికి చెప్పినా పట్టించుకోవటం లేదని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు చెప్పడంతో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవోలను పీడీ మందలించారు. సాంకేతిక సమస్యలను వారు ప్రస్తావించగా మీస్థాయిలో పరిష్కరించలేని సమస్యను తన దృష్టికి ఎందుకు తేలేదని ప్రశ్నించారు. ఎన్నోసార్లు కాన్ఫరెన్సులు పెట్టాను. సమస్యను చెప్పారా అని నిలదీశారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించిన కారణంగా ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు పీడీ సూర్యనారాయణ తెలిపారు. నడకుదురు ఎఫ్ఏ కె.గంగాభవాని, మాజేరు ఎఫ్ఏ ఎం.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశామన్నారు. పేదలకు 100 రోజుల పనికల్పించే విషయంలో అశ్రద్ధ, మస్టర్ దిద్దివేతలు, విధుల్లో నిర్లక్ష్యం వహించటం కారణాలతో చర్యలు తీసుకున్నామన్నారు. ఏపీవో, టీఏలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఏపీడీ పి.రామ్మోహనరావు, అంబుడ్స్‌మెన్ జి.శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ సత్యనారాయణ, ఏవో నాగమహేష్‌రావు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1,940 కేసుల పరిష్కారం

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 40 బెంచ్‌లలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 1,940 పెండింగ్ కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. 1,144 క్రిమినల్, 180 సివిల్, ఇన్సూరెన్స్ సంస్థలకు సంబంధించి 170 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. 82 మోటారు వాహన కేసులు పరిష్కరించి రూ.69.03 లక్షలను బాధితులకు ఇప్పించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పామర్రు అభివృద్ధికి తోడ్పాటునందించండి

▸ కలెక్టర్‌కు ఎమ్మెల్యే కుమార్‌రాజా వినతి

పామర్రు/ కూచిపూడి: నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్ డీకే బాలాజీని శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. కలెక్టర్‌ను సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, రైతుసంఘ ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ కూటమినేతలు పాల్గొన్నారు.

ఏపీ బార్ కౌన్సిల్ నిర్వాకంతో న్యాయవాదులకు నష్టం

▸ మచిలీపట్నం బార్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్

మచిలీపట్నం టౌన్, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రంలోని న్యాయవాదులు నష్టపోతున్నారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్సు పాలసీని రెన్యువల్ చేయించడంలో ఏపీ బార్ కౌన్సిల్ తగిన శ్రద్ధ చూపలేదని ఆయన ఆరోపించారు. దీంతో పాలసీలు ఇనాక్టివ్ అయ్యాయని అశోక్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వేలాది న్యాయవాదుల ఆరోగ్యంతో ఆటలాడుతున్న బార్ కౌన్సిల్ ప్రస్తుత పాలకవర్గం వెంటనే రాజీనామా చేయాలని, తిరిగి ఎన్నికలు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29: గ్రామీణ ప్రజలకు, మహిళలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తూ వీరవల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ పిల్లా అనిత కొనియాడారు. చీఫ్ మేనేజర్‌గా పదవీవిరమణ చేసిన యార్లగడ్డ మాధవికి గుడివాడ ఆర్ఎం(రీజనల్ మేనేజర్) జీఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ 35 ఏళ్లుగా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువచేయడంతో పాటు, డ్వాక్రా మహిళలు, రైతులకు మెరుగైన సేవలందించి వీరవల్లి శాఖను ముందంజలో నిలిపేందుకు మాధవి చేసిన కృషి అద్వితీయమని నాయకులు లంక సురేంద్రమోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్ పేర్కొన్నారు. మాధవి, రవికుమార్ దంపతులను బాపులపాడు మండల ఏపీఎం భూపతిరావు, కలపాల నాని, డ్వాక్రా మహిళలు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు.



పదవీ విరమణ చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి దంపతులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు, స్థానిక నేతలు



ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గోదామును పరిశీలిస్తున్న సీఈవో ముఖేశ్ కుమార్ మీనా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ఈవీఎంలు, వీవీ ప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూన్ 29: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం), వీవీ ప్యాట్లు ఉంచిన గోదాముకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం గొల్లపూడిలోని ఈవీఎంలు, వీవీ ప్యాట్లు ఉంచిన గోదామును రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా, సమన్వయ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలకొకసారి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తామని తెలిపారు. శనివారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు. వర్షాకాలం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. వీఎంసీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, వై.రామయ్య (టీడీపీ), వై.ఆంజనేయరెడ్డి, ఎల్.శివరామ్ ప్రసాద్(వైసీపీ), బి.కిరణ్(ఐఎన్‌సీ), వై.కృష్ణకిషోర్ (నవ తరంపార్టీ) పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 29: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గాన ద్వారకాతిరుమల వెళుతూ అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు.



అభయాంజనేయస్వామి సన్నిధిలో జస్టిస్ వెంకటజ్యోతిర్మయి దంపతులు

ఈవో కూచిపూడి శ్రీనివాస్, ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. నూజివీడు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కత్తెరతో పొడిచిన వ్యక్తిపై కేసు

పెనమలూరు, జూన్ 29 : గతంలో ఉన్న గొడవలను దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై వెళుతుండగా వెనక నుంచి వచ్చిన ఒక యువకుడు మరో యువకుడిని కత్తెరతో పొడిచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురుకు చెందిన పొన్నాల సాయికుమార్‌కు, అదే ప్రాంతంలో ఉండే షేక్ షాజుద్దీన్‌కు గతంలో గొడవలుండేవి. గొడవల గురించి పోలీసుస్టేషన్లో సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షాజుద్దీన్‌కు పోలీసులు గతంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గత బుధవారం ఆవీధిలో నడుచుకొంటూ వెళుతున్న సాయికుమార్‌పై షాజుద్దీన్ కత్తెరతో దాడి చేసి గాయపరిచాడు. సాయికుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉయ్యూరు నగర పంచాయతీ ఎక్స్ అఫిషియో మెంబరుగా బోడె ప్రసాద్



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూన్ 29 : ఉయ్యూరు నగర పంచాయతీ కౌన్సిల్ ఎక్స్ అఫీషి యో మెంబరుగా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. నగర పంచాయతీ కార్యాల యంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిల్ ఎక్స్‌అఫీషియో మెంబరుగా బోడె ప్రసాద్ చేత నగర పంచాయతి కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్‌కు పలువురు కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎజెండాలోని పలు అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 13, 14 వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన వారందరికి టిడ్కో ఇళ్ల మంజూరు చేయాలని 20వ వార్డు కౌన్సిలర్ పండ్రాజు సుధారాణి అన్నారు.

డీజీపీకి సామాజికవేత్త సజ్జా శుభాకాంక్షలు

ఉయ్యూరు, జూన్ 29 : ఆంధ్ర ప్రదేశ్ డీజీపీగా బాధ్యతలు చేప ట్టిన ద్వారకా తిరుమలరావుకు గండిగుంటకు చెందిన సామాజికవేత్త సజ్జా వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి కార్యాలయంలో శనివారం డీజీపీని కలిసిన సజ్జా ఆయనకు తామరపుష్పం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ద్వారకా తిరుమలరావు విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయం, మండల తహసీల్దార్ ఇతర కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సజ్జా విరాళంగా ఇచ్చారు. భవనాల నిర్మాణం జరుగుతున్న సమయంలో డీజీపీ పలు పర్యాయాలు వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం భవనాల స్థితిగతులను వివరించగా సానుకూలంగా స్పందించినట్టు సజ్జా తెలిపారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సజ్జా

నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి

గన్నవరం, జూన్ 29 : విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని ఎన్‌సీసీ 3(ఎ) ఆర్అండ్‌వీ గన్నవరం కమాండింగ్ ఆఫీసర్ తీర్థ ప్రసాద్ అన్నారు. స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణా స్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎన్నికైన బాలుర విద్యార్థి నాయకుడు కె.వైభవ్, బాలికల నాయకురాలు జె.జాగృతి, కళాశాల బాలుర నాయకులు సత్యసాయి చరణ్, బాలికల నాయకురాలు భూమిక, తరగతుల వారీగా క్యాబినెట్ విద్యార్థులతో ప్రమాణాస్వీకారం చేయించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి పూర్వ విద్యార్థులు వి.తిరుమల తోడరమల్, టాన్యకుమారి, వసుందర లక్ష్మీ, వాసుదేవ్ చైతన్య, ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ సంతోష్‌కుమార్, సీజె థామస్, జిమ్మి కురియాకోస్, బల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, కిట్స్ పంపిణీ

ఉయ్యూరు, జూన్ 29 : సెయింట్‌లూకాస్ అనాధబాలల ఆశ్రమంలో విద్యార్థులకు ది గుడ్‌విన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్కూల్ బ్యాగులు, కిట్లు బీఎస్పీ నాయకురాలు దేవరపల్లి దేవమణి పంపిణీ చేశారు. పట్టుదల, కృషితో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆశ్రమ నిర్వాహకుడు జోషి తదితరులు దేవమణికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ. 3వేల నుంచి రూ.4 వేలకు పింఛన్ పెంచి

మాట నిలబెట్టుకున్నాం

రేపు లబ్ధిదారులకు రూ.7వేలు అందిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 29: పింఛన్ సొమ్మును రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని, ఆ సొమ్మును మునుపటి నెలల బకాయిలతో కలిపి రూ.7 వేల చొప్పున జూలై 1న ఉదయం 6 గంటలకే సచివాలయ కార్యదర్శులు ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మంత్రి మాట్లాడారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 31,068 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. గతంలో మచిలీపట్నం నియో జకవర్గంలో రూ.9.31 కోట్లు పంపిణీ చేయగా, ప్రస్తుతం పెంచిన పింఛనుతో కలిపి రూ.21 కోట్లకు పైగా పంపిణీ చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో మచిలీపట్నాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఇన్‌చార్జి డీఆర్డీయే పీడీ, డీపీవో నాగేశ్వర నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణాజిల్లాలో 2,42,341 మందికి ఇంటి వద్దకే పింఛన్లు

▸ రూ.162.42 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు చేశాం: కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): "కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 2,42,321 మందికి జూలై 1న ఇంటివద్దకే సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో రూ. 162.42 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జూలై 1వ తేదీన ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తారు. ధ్రువీకరణపత్రాలు, ముఖ్యమంత్రిలేఖను పింఛనుతోపాటు అందిస్తారు." అని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక పింఛన్ల పంపిణీపై ఆయన సమీక్ష నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి నూతనంగా రూపొందించిన మొబైల్‌యాప్‌ను అధికారులు, సచివాలయ సిబ్బంది ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ పరికరాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే బ్యాంకులనుంచి 70శాతం నగదును డ్రా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన

▸ సమస్యలపై కొల్లు రవీంద్రకు 300 అర్జీలు

▸ పరిష్కరిస్తామని మంత్రి హామీ

మచిలీపట్నం టౌన్, జూన్ 29: టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మంత్రి కొల్లు రవీంద్రకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. టిడ్కో ఇళ్లు మంజూరు చేసినా ఐదేళ్లుగా ఇళ్లు చూపలేదని లబ్ధిదారులు మంత్రికి మొరపెట్టుకున్నారు. పింఛన్లు అందడం లేదని కొందరు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నా ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదని మరికొందరు వినతిపత్రాలిచ్చారు. వివిధ డివిజన్లు, గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమకు ప్రభుత్వ పథకాల నగదు బ్యాంకుల్లో జమ కావడం లేదని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు పల్లపు భూముల్లో ఉన్నాయని అధిక సంఖ్యలో వినతులిచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్‌లు అందడం లేదని కొందరు విద్యార్థులు ఏకరువు పెట్టారు. పోతేపల్లి, హుస్సేన్‌పాలెం గ్రామాల్లో లో ఓల్టేజీ, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేయాలని మరికొందరు అర్జీలు ఇచ్చారు. దాదాపు 300 అర్జీలు కొల్లు రవీంద్రకు అందించారు. "ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపుతాం. సమస్యలు పరిష్కారమయ్యేందుకు సమీక్ష చేస్తా." అని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, గోపు సత్యనారాయణ, చిత్తజల్లు నాగరాము పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న కొల్లు రవీంద్ర



ఎంపీ కేశినేని చిన్నిని సత్కరిస్తున్న బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీను

టీడీపీ నేతలంతా ఒకే మాట, బాటగా నడుస్తాం

సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం: ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 29: "టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న చిత్తశుద్ధితో పని చేసే నాయకుడు. నాకు, బుద్దా వెంకన్నకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు. నాగుల్ మీరా, బుద్దా వెంకన్న ఎనికల్లో నాకు పూర్తి సహకారం అందించారు. అండగా నిలిచారు. ఇక నుంచి నగరంలో ఉన్న టీడీపీ నాయకులమంతా ఒకే మాట, ఒకే బాటగా నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని సీనియర్ నాయకులకు పదవుల్లో న్యాయం జరిగేలా చూస్తాం." అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుద్దా వెంకన్న నివాసంలో శనివారం కేశినేని చిన్నికి సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రథం సెంటర్ నుంచి తన కార్యాలయం వరకు ఓపెన్ టాప్ జీప్‌పై చిన్నిని భారీ ర్యాలీతో వెంకన్న తీసుకొచ్చారు. నాయకులు నాగుల్‌మీరా, చెన్నుపాటి శ్రీను, పట్టాభిరామ్‌తో కలిసి ఎంపీని సత్కరించారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చెన్నుపాటి శ్రీనుకు కూడా పదవులు దక్కేలా కృషి చేస్తానని చిన్ని హామీ ఇచ్చారు. విజయవాడ టీం టీడీపీకి కేశినేని చిన్నిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), నాయకులు కాండ్రేగుల రవీంద్ర, పేరాబత్తుల రమణ, కామదేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఈగల సాంబ, నందకుమారి, తుపాకుల రమణమ్మ, పత్తి నాగేశ్వరరావు, మైలవరపు వీరబాబు, గుర్రం కొండా, గంగాధర్ రెడ్డి, కుంచం దుర్గారావు, వల్లభనేని ప్రసన్నలక్ష్మి, పితాని పద్మ, షేక్ అమానుల్లా, బడుగు వెంకన్న, శివాజీ పాల్గొన్నారు.

చిన్ని సారథ్యంలో నడుస్తాం: బుద్దా వెంకన్న

"కేశినేని చిన్ని అంకితభావం గల నాయకుడు. మరో రెండుసార్లు విజయవాడ ఎంపీగా ఆయన ఎన్నికవుతారు. మూడోసారి ప్రమాణస్వీకారం చేసేంతవరకు ఆయన వెంట ఉంటా. కేశినేని నాని ఎంపీగా ఎన్నికయ్యాక చంద్రబాబుపై వ్యాఖ్యలు చేశారు. అందువల్లే ఆయనను వ్యతిరేకించా. ఇప్పుడు మేమంతా చిన్ని సారథ్యంలో నడుస్తాం. పశ్చిమ నియోజకవర్గంలోని నాయకులందరం చిన్నితోనే ఉంటాం. చిన్నిపై అనవసరంగా ఎవరైనా నోరు పారేసుకుంటే అక్కడ నుంచే మా పోరాటం ప్రారంభిస్తాం" అని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

మదర్సా ఘటనపై ఎన్టీఆర్ కలెక్టర్ ఆరా

▸ సృజన ఆదేశాలతో కేసును వేగవంతం చేసిన పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 29: అజిత్‌సింగ్‌నగర్ మదర్సా ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆరా తీశారు. జరిగిన ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరిష్మా మృతి పట్ల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీసులు కేసును వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. కాగా మదర్సాలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో పాటుగా తెలంగాణకు చెందిన విద్యార్థినులు 60 మందికి పైగా ఉన్న విషయం తెలిసిందే. కరిష్మా అనుమానాస్పదంగా మృతిచెందడంతో మదర్సా నుంచి విద్యార్థినులను తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. దీంతో మదర్సా ఖాళీ అయిపోంది. మదర్సా నిర్వాహకుడు సయ్యద్ షాహీద్ ఫర్వీజ్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇప్పటికే మదర్సాలో నిల్వ ఉంచిన బీఫ్, మటన్ శాంపిల్స్‌ను ల్యాబ్ టెస్టింగ్‌కు అధికారులు పంపించారు. మదర్సాలో మొత్తం 60 మంది విద్యార్థులు ఉండగా కరిష్మాకు మాత్రమే ఫుడ్ పాయిజన్ కావడంపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసును మరింత వేగవంతం చేశారు.

కారు అడ్డుతీయమని హారన్ కొట్టినందుకు

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి

▸ ఇద్దరిపై కేసు

గుడివాడ: బస్సుకు అడ్డుగా ఉన్న కారును తీయమని హారన్ కొట్టినందుకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై ఇద్దరు దాడి చేశారు. ఈ ఘటన గుడివాడలో శనివారం జరిగింది. డ్రైవర్ ఫిర్యాదుపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలి పారు. అవనిగడ్డ నుంచి గుడివాడకు ఏపీ 39 యూజే 6006 నెంబరు ఆర్టీసీ బస్సు వస్తుండగా స్థానిక హోటల్ అతిథి ఇన్ వద్ద ఏపీ 16డీజే 8010కారు అడ్డుగా ఉంది. కారును పక్కకు తీయాలని బస్సు డ్రైవర్ సిరిపెళ్ల రాకేష్ పలుమార్లు హారన్ కొట్టాడు. దీంతో ఫుల్లుగా మద్యం తాగి ఉన్న ఇద్దరు కారు నుంచి దిగి డ్రైవర్‌ను దుర్భాషలాడి, చెయ్యి చేసుకున్నారు. స్థానికులు గుమిగూడడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపో యారు. మళ్లీ వారు నేరుగా బస్టాండ్‌కు వెళ్లి బస్సు డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. రాకేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఎం.నాగ దుర్గారావు తెలిపారు. దాడికి పాల్పడిన వారి వివరాలు ఇంకా తెలియలేదు.



దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గుడివాడ ఆర్టీసీ డిపో వద్ద డిమాండ్ చేస్తున్న డ్రైవర్లు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: సీఐటీయూ

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిచేసి గాయపరచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. కారు అడ్డుగా ఉండటంతో డ్రైవర్ హారన్ కొట్టాడని, దీనికే ఇద్దరు నేరుగా బస్టాండ్‌లోకి వచ్చి దాడి చేశారని, రాష్ట్రంలో అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బస్సు డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఉండవల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాకేజీలపై ప్రశ్నలు, గందరగోళం

▸ అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ రైతుల సమావేశం నేటికి వాయిదా

తాడేపల్లి టౌన్, జూన్ 29: సీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి గ్రామ సచివాలయం-2లో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశం గందరగోళానికి దారితీసింది. సమావేశం ప్రారంభం కాగానే ఓ రైతు భూములకు సంబంధించి వివరాలు తెలపాలని కోరారు. అదేవిధంగా ఎంత ప్యాకేజీ ఇస్తారు? ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తుండగా అక్కడే ఉన్న టీడీపీకి చెందిన రైతులు కలగజేసుకుని గత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ఏం చేశారంటూ నిలదీశారు. ఇప్పుడు వచ్చి ప్రశ్నిస్తున్నారని, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా మళ్లీ సర్వే ఎలా చేస్తారని కొందరు రైతులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెండున్నరేళ్లపాటు కనీసం కౌలు డబ్బులు కూడా ఇవ్వకపోతే ఎందుకు నిలదీయలేదని మరికొందరు రైతులు ప్రశ్నించారు. రాజధాని పేరుతో ధరలు పెరగ డంతో భూములను రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని, అమరావతి కోసం ఏర్పాటు చేస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డుకు అడ్డుపడుతూ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తు న్నారని విమర్శించారు. రైతుల అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడ డంతో డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు సమావేశం అర్ధాంతరంగా నిలిపి వేశారు. ఆదివారం సాయంత్రం మరోసారి భేటీ అవుదామని రైతులకు తేల్చి చెప్పారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఉంగుటూరు, జూన్ 29 : వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తు నివారణా చర్యలు చేపట్టాలని, అందుకోసం పంచాయతీ అధికారులుప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈవోపీఆర్డీ ఎం.అమీర్‌బాషా అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రక్షిత నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలు నియంత్రించడంపై ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉంగుటూరు, ఇందుపల్లి, పెదఅవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేశ్వరరావు

లయన్స్ సేవలకు సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజ లకు అందిస్తున్న వివిధ రకాల సేవలకు దాతలు సహకరించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ చారిటీట్రస్ట్ కార్యదర్శి గూడపాటి రత్న శేఖర్ అన్నారు. హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ అభివృద్ధి, సేవల నిమి త్తం చారిటీట్రస్ట్‌కు తండ్రి వల్లభనేని త్రివేది జ్ఞాపకార్థంగా రాజేష్ రూ.25వేల విరాళం శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేగిరెడ్డి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మం మృతి టీడీపీకి తీరని లోటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29 : కోడూరుపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గరికపాటి బ్రహ్మం (55) శనివారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందుతున్న బ్రహ్మం శుక్రవారం మృతి చెందడంతో ఆయన భౌతిక కాయాన్ని కోడూరుపాడు తీసుకువచ్చారు. కోడూరుపాడులో బ్రహ్మం భౌతికకాయానికి టీడీపీ నాయకులు యార్లగడ్డ సతీష్, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబూరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యు లను పరామర్శించారు. టీడీపీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకుడిని కోల్పోవడం తీరనిలోటని సతీష్ అన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, మొవ్వా వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు గరికపాటి నాగలక్ష్మి, వడ్డిల్లి లక్ష్మి, నెక్కంటి శ్రీదేవి, మండాది రవీంద్ర, శివన్నారాయణ నివాళులర్పించారు.

కౌలురైతు చట్టాన్ని అమలు చేయాలి



వెల్దిపాడులో కౌలురైతు చట్టంపై అవగాహన కల్పిస్తున్న కౌలు రైతుల సంఘం నేతలు

ఉంగుటూరు, జూన్ 29 : భూములు సాగు చేస్తున్న కౌలురైతులందరికీ కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాం లో కౌలురైతుల హక్కులు కాలరాసేందుకు తీసుకొచ్చిన సీసీఆర్సీ చట్టాన్ని రద్దుచేసి 2011లో పోరాడి తెచ్చుకున్న కౌలురైతుల చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ కౌలు రైతుల సంఘం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని వెల్దిపాడులో పర్యటించి కౌలురైతు చట్టంపై కౌలుదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, కౌలురైతులు ఆనందరావు, కోటయ్య, వెంకటేశ్వరరావు, రాంపండు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29: గ్రామీణ ప్రజలకు, మహిళలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తూ వీరవల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ పిల్లా అనిత కొనియాడారు. చీఫ్ మేనేజర్‌గా పదవీవిరమణ చేసిన యార్లగడ్డ మాధవికి గుడివాడ ఆర్ఎం(రీజనల్ మేనేజర్) జీఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ 35 ఏళ్లుగా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువచేయడంతో పాటు, డ్వాక్రా మహిళలు, రైతులకు మెరుగైన సేవలందించి వీరవల్లి శాఖను ముందంజలో నిలిపేందుకు మాధవి చేసిన కృషి అద్వితీయమని నాయకులు లంక సురేంద్రమోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్ పేర్కొన్నారు. మాధవి, రవికుమార్ దంపతులను బాపులపాడు మండల ఏపీఎం భూపతిరావు, కలపాల నాని, డ్వాక్రా మహిళలు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు.



పదవీ విరమణ చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ యార్లగడ్డ మాధవి దంపతులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు, స్థానిక నేతలు

మంత్రి రవీంద్రకు సన్మానం

పెనమలూరు, జూన్ 29 : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్రను టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధా కార్యదర్శి షేక్ బుజ్జి శుక్రవారం రాత్రి కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడ భారతీనగర్‌లోని మంత్రి నివాసంలో షేక్ బుజ్జి, తనయుడు టీడీపీ రెహమాన్‌లు మంత్రిని శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి కొల్లును సన్మానిస్తున్న షేక్ బుజ్జి

టిడ్కో ఇళ్లు అప్పగించడమే లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూన్ 29 : టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించడమే తన ప్రధాన లక్ష్యమని ఇందుకు అని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పట్టణ పరిధిలో టిడ్కో ఇళ్లు మంజూరు కాని 145 మంది కట్టిన డిపాజిట్ రూ. 28,70,500లను చెక్కు ద్వారా నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం డిపాజిట్‌దారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019 సంవత్సరంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని, తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కొందరిని అనర్హులుగా ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండా నిలిచిపోయిందన్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథికి టిడ్కో ఇళ్లపై అవగాహన కల్పించి ఆయన సహకారంతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అప్పగిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంతో నమ్మకంతో కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకో వాలిసిన బాధ్యత మాపై ఉందన్నారు. ప్రజల అభిమానాన్ని మరువకుండా చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్య నారాయణ, తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, టిడ్కో డైరెక్టర్ చిన్నోడు, కమిషనర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



డిపాజిట్‌దారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా మెలగాలి

పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా మెలగాలిసిన బాధ్యత పోలీసులపై ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు రూరల్ స్టేషన్‌కు వచ్చిన కడవకొల్లు, చినఓగిరాల ఇతర గ్రామాల టీడీపీ నాయకుల పట్ల ఎస్సై అవినాశ్ అమర్యాదగా, అవమానించే విధంగా ప్రవర్తించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు శనివారం స్టేషన్‌లో ఎస్సైతో మాట్లాడారు. గ్రామంలో వచ్చిన ఓ ఫిర్యాదుకు సంబంధించి స్టేషన్‌కు వచ్చిన కుప్పాల అంజిబాబు, అంతకు ముందు చినఓగిరాల చెందిన మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, ఇతరుల పట్ల అవమానకరంగా వ్యవహరించారని ఆరోపణలపై ఎస్సైను వివరణ కోరారు. పట్టణ సీఐ హబీబ్ బాషా ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

భారతీనగర్(గుణదల), జూన్ 29 : రైతులకు సాగునీటి సమస్య లేకుండా చూడాలని నీటి పారుదల శాఖ అధికారులకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఫన్‌టైం క్లబ్ రోడ్డులోని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కార్యాలయంలో శనివారం నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి సమస్య రాకుండా చూడాలని, అందుకు కావాల్సిన చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

సేవా కార్యక్రమాలతో లయనిజానికి గౌరవం

లయన్స్ జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా

హనుమాన్‌జంక్షన్, జూన్ 29 : సేవా దృక్పథంతో కార్యక్రమాలు నిర్వహించి నపుడే లయనిజానికి మరింత గౌరవం వస్తుందని లయన్స్ జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక లయన్స్‌క్లబ్‌లో హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడుగా కళ్లేపల్లి నారాయణరావు, కార్యదర్శి తమిరి రమేష్, కోశాధికారిగా తూములూరి సాంబశివ రావు, కమిటీ సభ్యులు చేత ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పుట్టగుంట సతీష్ కుమార్ అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గానికి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుట్టగుంటను నూతన కార్యవర్గం ఘనంగా సత్కరించి ఆయన అందించిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆర్.వెంక టేశ్వరరెడ్డి, ఎస్. ఎన్.వి.సుబ్బారావు,ఎన్. వెంకటేశ్వరరావు, వీరమాచనేని సత్యప్రసాద్, నందూరు సత్యవెంకటేశ్వర శర్మ, ఏ.ఎస్.ఫణీంద్ర, చలసాని వెంకటేశ్వరరావు, అక్కినేని రాఘవేంద్రరావు, మేడికొండ బుచ్చిబాపయ్య, వీరమాచనేని నాగయ్య, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అధ్యక్ష కార్యదర్శులు కళ్లేపల్లి నారాయణరావు, తమిరి రమేష్ దంపతులను క్లబ్ సభ్యులు, మిత్రులు, సన్నిహితులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా, పాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్

లోక్ అదాలత్‌లో 37 కేసులు పరిష్కారం

ఉయ్యూరు, జూన్ 29 : జాతీయ లోక్‌అదాలత్ పురస్కరించుకుని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించి 37 కేసులు జడ్జికం మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ కె.శ్రీహరి పరిష్కరించారు. బార్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, సీనియర్ న్యాయ వాదులు టి.చంటిబాబు, మోర్ల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ధనలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.35

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి మచిలీపట్నానికి చెందిన డాక్టర్ ఎల్.రాహుల్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. కుటుంబసమేతంగా శనివారం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావుకు విరాళం అందజేశారు.

విశ్వనాథపల్లి నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.4.77 లక్షలు

కోడూరు : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ఆలయంలోని హుండీల కానుకలు లెక్కించగా, 94 రోజులకు రూ.4,77,707 వచ్చినట్లు ఈవో సిహెచ్.సుధాకర్ తెలిపారు. మచిలీపట్నం దేవదాయ శాఖ తనిఖీ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్లు తెలిపారు. గ్రామస్థులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బందరును సుందర నగరం చేద్దాం

నేడే చూడండి

కంకిపాడు : శ్రీవిజయలక్ష్మీ టాకీస్ A/C dts



రోజూ 4 ఆటలు : 11-30AM, 03-00PM 06-30PM, 10-00PM

• నగరపాలక సంస్థ అధికారులతో కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, జూన్ 29 : సుందర నగరంగా బందరును తీర్చిదిద్దుదామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం నగరంలో కలెక్టర్ పర్యటించారు. కోనేరు సెంటర్‌ను సందర్శించారు. షాపుల యజమానులు చెత్తను మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. కోనేరుసెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరుసెంటర్‌ను పూలమొక్కలతో అందంగా తీర్చిదిద్దాలని కమిషనర్ బాపిరాజుకు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రెవెన్యూ వసూళ్లు, సచివాలయ వ్యవస్థ, పించన్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ , రెవెన్యూ, ప్లానింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సత్కారం



గుడివాడ : పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉతీర్ణత సాధించిన నేపథ్యంలో ఆరు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను పుట్టి వెంకటేశ్వరరావు సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుట్టి నాగలక్ష్మి ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ జానీసాహెబ్, పి.ఎల్.నరసమాంబ, పి.రాణి, జి.సంధ్య, స్రవంతి, ఎం.ఉమామహేశ్వరరావు, మాజీ ప్రిన్సిపాల్ ఎం.వి.ఆంజనేయులు, చిరంజీవి, ఎస్‌టీయు కార్యదర్శి డి.చంద్రశేఖర్, పి.సత్యశ్రీ, భారతిలను ఘనంగా సత్కరించారు.



సాధారణ బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, CNR **ఆక్వా ఎంటర్‌ప్రైజెస్ మరియు దాని యజమాని శ్రీ బర్రె జయరాజు, S/o గంటయ్య,** వయస్సు సుమారు 41 సంవత్సరాలు, నివాసం : డి.నం.6-194/1, మోడీ గ్రామం, కాళ్ల మండలం, కాలపపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534201 వారు **రూ.5,13,46,130/- (అక్షరాల ఐదు కోట్ల పదమూడు లక్షల నలభై ఆరు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే)** లకు వ్యతిరేకంగా మా క్లైంటు తీర్పు పొందిన కారణంగా, గౌరవనీయులైన 34వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, బెంగుళూరు, మేయో హాల్ యూనిట్, **శ్రీ బర్రె జయరాజు**కు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్‌లను కూడా జారీ చేసింది. ఏ వ్యక్తి అయినా తన స్థానం మరియు ఆచూకీ గురించి అవగాహన కలిగి ఉన్నట్లయితే, దిగువ సంతకం చేసిన వ్యక్తికి వీలైనంత త్వరగా తెలియజేయవలసి ఉంటుంది. పై తీర్పు అనుగుణంగా **శ్రీ బర్రె జయరాజు**కు చెందిన ఏదైనా ఆస్తి దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవలసిందిగా మేము సాధారణ ప్రజలను కూడా కోరుతున్నాము. సమాచారం ఇచ్చేవారికి తగిన రివార్డు ఉంటుంది.

శ్రీ గుంజల వెంకట నాగరాజు, తండ్రి : రామస్వామి, వయస్సు సుమారు 47 సంవత్సరాలు, నివాసం : డి.నెం.29/170-189-4ఎ, ఇనగూదూరుపేట, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వారు మా క్లయింట్‌కు అనుకూలంగా, టైటిల్ డీడ్ డిపాజిట్ ద్వారా, R.Sలో 2059 చదరపు గజాల (501.666 చ.గజాలు + 1577.333 చదరపు గజాలు) ఆస్తి నం.401, డి.సం.29/170-98, ఇనగూదూరుపేట, అమృతపురం, బాదరు తూర్పు, రెవెన్యూ వార్డ్ నం.1, మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో, మచిలీపట్నం SROలో, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఆస్తి నా క్లయింట్‌కు తనఖా పెట్టబడినందున దానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరపకూడదని లేదా ఏ విధమైన లావాదేవీలు చేయవద్దని మేము సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నాము.

చిరునామా :
మెస్సర్స్ వెంకటేష్, అమర్‌నాథ్ & కో.,
న్యాయవాదులు,
నెం.432, 1వ అంతస్తు, 12వ క్రాస్,
సదాశివనగర్, బెంగళూరు- 560 080
ఫోన్ : +91-9886140745, +91-9738129600

తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు

అవనిగడ్డ, జూన్ 29 : తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. లంకమ్మమాన్యం, మండలిపురం, రాజశేఖరపురం ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి పరిస్థితులను బుద్ధప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. లంకమ్మమాన్యం, రాజశేఖరపురం కాలనీల్లో బుద్ధప్రసాద్ ఆదేశాలతో ఇప్పటికే కొత్త బోరు ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో బోరు చుట్టూ దిమ్మె కట్టడం పూర్తి చేసి తాగునీటిని అందించాలన్నారు. రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్లను బాగు చేయించి నీటిని విడుదల చేస్తే ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తదని అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, ఏఈ జగన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రక్షిత నీటి పథకాన్ని పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్



హెడ్ వాటర్ వర్క్‌లో నీటిని పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

అందరికీ సురక్షిత నీరు : వెనిగండ్ల

గుడివాడ : వచ్చే ఏడాదికల్లా ట్యాంకర్లతో పనిలేకుండా నేరుగా అందరికీ సురక్షిత తాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామి ఇచ్చారు. పెద ఎరుకపాడులోని పురపాలక సంఘం హెడ్ వాటర్ వర్క్స్‌ను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 12 ఎంఎల్‌డీ ప్లాంట్ పనులను, పాత చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరతగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత ఇబ్బందిగా ఉందని, దానికి కారణమైన వ్యాపారులకు జరిమానా విధించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈలు, మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో ప్రజల సమస్యలు పరిష్కరించాలి : కాగిత



పెడన రూరల్ : ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, సాగునీరు, హౌసింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరితగతిన ఇంటింటి కుళాయి పథకం పూర్తిచేయాలన్నారు. సాగునీటి సమస్య ను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. నడుపూరు-కొత్తపల్లి రోడ్డుకు ఏర్పాటుకు రూ.53 కోట్లు మంజూరైనా, కాంట్రాక్టర్లు రాకపోవటంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. రోడ్ల మరమ్మతులకు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు నగేష్, చిన బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమాస్రవంతి, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, భరద్వాజ్, హరిబాబు, సురేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, గుడిశేవ రామారావు, కట్టా సతీస్, పరసా కామేశ్వరరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మొవ్వ లోక్‌అదాలత్‌లో 70 కేసుల పరిష్కారం

కూచిపూడి : మండల న్యాయసాధికార సంస్థ ఆధ్వర్యంలో మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. 70 కేసులకు న్యాయమూర్తి రాజన్ ఉదయ్ ప్రకాష్ పరిష్కారం చూపారు. కూచిపూడి, కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 15, ఘంటసాలలో 15, మోపిదేవి, చల్లపల్లి స్టేషన్లలో 20 చొప్పున కేసులను పరిష్కరించారు.

బంటుమిల్లి లోక్‌అదాలత్‌లో 30 కేసుల రాజీ

బంటుమిల్లి : లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుంటే కక్షిదారులకు విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చునని బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవా సాధికార కమిటీ ఛైర్మన్ ఎం.భాస్కరరావు అన్నారు. కోర్టు ఆవరణంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన మూడు సివిల్ కేసులు, ఎక్సైజ్, క్రిమినల్‌కు సంబంధించి 30 కేసులు రాజీ అయినట్లు తెలిపారు. బార్ సభ్యులు యాళ్ల సోమశేఖర్, న్యాయవాదులు ఈవీఎస్ రాయుడు, పళ్ళెం వీరవెంకటేశ్వరరావు, తమ్మన సురేష్, పులి పవన్‌కుమార్, సూదాబత్తుల సురేష్, మోజెస్, సూర్య పాల్గొన్నారు.

పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు ఘన సత్కారం, వీడ్కోలు

పెడన రూరల్ : పదవీ విరమణ సందర్భంగా మండల కార్యాలయ ఏవో బాలాజీ, అటెండర్ ఎస్.వెంకటేశ్వరరావు దంపతులను ఎంపీపీ వాణి, ఎంపీడీవో రెడ్డియ్య ఘనంగా సత్కరించారు. అచ్యుతరావు, వరప్రసాద్, భైరవలింగం, విజయకుమారి, ప్రకాష్ పాల్గొన్నారు. **గుడివాడ** : ఆర్‌డబ్ల్యూఎస్ సీనియర్ అసిస్టెంట్ చలసాని అశోక్‌ను ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫరీద్‌బాషా, జి.రాజేంద్రప్రసాద్ ఘనంగా సత్కరించారు. కె.పి రావు, తోట వరప్రసాద్, పాపయ్య, ప్రసాద్, సోమశేఖర్, మహేష్ పాల్గొన్నారు. **మోపిదేవి** : ఎంఈవో కె.రాజ్‌కుమార్‌ను మధ్యాహ్న భోజన నిర్వాహకులు శనివారం ఘనంగా సత్కరించారు. ఎంఐఎస్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు .**పెడన** : పబ్లిక్ హెల్త్ వర్కర్ ఉమ్మిటి ఆనందరావును మునిసిపల్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామయ్య, టీపీవో ఏసుబాబు, పామర్తి వెంకటేశ్వరరావు, పెద్దిరాజు, సుందరం, శివ, మనోహర్, గిరిప్రసాద్, విఠల్, జితేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు. **పమిడిముక్కల** : తాడంకి జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు పాటిబండ్ల చంద్రశేఖర్‌శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. హెచ్ గోవర్ధనరావు, శ్రీనివాసరావు, ఆంజనేయ ప్రసాద్, పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ రామలింగశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న నాట్యాచార్యులు

రామలింగశాస్త్రి సేవలు అభినందనీయం

కూచిపూడి : కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి కూచిపూడి నాట్యానికి చేసిన సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. రామలింగశాస్త్రి పదవీ విరమణ సందర్భంగా కళాపీఠంలో శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ ప్రతినిధి బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ, వేదాంతం రాధేశ్యామ్, యేలేశ్వరపు శ్రీనివాస్, గ్రంథాలయాధికారి ఫణికుమార్, కళాపీఠం పర్యవేక్షకులు పార్థసారథి, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో ఐదు అంశాలపై జనసేన డిసెంట్

పెడన, జూన్ 29 : ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం జరిగిన పెడన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని 21 అంశాలకు ఐదు అంశాలపై 12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని డిసెంట్ ఇచ్చారు. పంచాయతీ రాజ్ స్థలంలో ఏటీఎం ఏర్పాటు కోసం ఇండియా 1 పేమెంట్ లిమిటెడ్ సంస్థకు స్థలం కేటాయింపునకు సంబంధించిన అంశంపై ఆమె డిసెం ట్ ఇచ్చారు. వైసీపీ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ, అన్ని మునిసిపాలిటీలను సంప్రదించిన తరువాతే మునిసిపాలిటీకి ఆదాయం వస్తుందన్న కారణంగా ఏటీఎం ఏర్పాటుకు అనుమతించడం జరిగిందన్నారు. సచివాలయ భవనాలకు ఐదు శాతం అద్దె పెంపునకు సంబంధించిన అంశంపై కూడా ఆమె డిసెంట్ ఇచ్చారు. ప్రజలకు అనుకూలంగా లేని సచివాలయ భవనాలను మార్పు చేయాలని ఎమ్మెల్యే భావిస్తున్నందున ఈ అంశాన్ని వాయిదా వేయాలని ఆమె సూచించారు. అందుకు కమిషనర్ అంగీకరించలేదు. దీంతో ఈ అంశంపై కూడా శివపావని డిసెంట్ ఇచ్చారు. శానిటేషన్, మున్సిపల్ వర్కర్ల సంఖ్య పెంపు అంశంపై కూడా ఆమె డిసెంట్ ఇచ్చారు. ప్రభు త్వ ఆదేశాల మేరకు బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్ భవనంలో ఉన్న మహిళా మార్టును ఖాళీ చేయించాలని సమావేశం నిర్ణయించింది. శివపావని ఏకంగా ఐదుఅంశాలపై డిసెంట్ ఇవ్వడమే కాకుండా మునిసిపాలిటీలో ఐదేళ్ల వైసీపీ పాలన అధ్వానంగా సాగిందని ఆమె విమర్శలు సంధించారు. బి.వెంకట్రామయ్య, టీపీవో ఏసుబాబు, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ సీతారామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బంటుమిల్లి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. చోరంపూడి ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఎంఈవో బాలత్రిపురసుందరి, గ్రామసర్పంచ్ రేవు నాగలక్ష్మి, ఎంపీపీ వెలివెల చినబాబు, జడ్పీటీసీ సభ్యుడు మలిశెట్టి వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, ఇల్లూరి లీలాకృష్ణ, కాశీ, రంగనాథ్, గోపాలకృష్ణ, కొండ, జయస్వామి, హెచ్‌ఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.

కానూరు జడ్పీ పాఠశాలలో...

మచిలీపట్నం టౌన్ : కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, పాఠ్యపుస్తకాలను తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పంపిణీ చేశారు. చిటికెన అయ్యప్ప, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, ఈమన సత్యనారాయణ, చిన్నా, పాము తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

కోడూరు : బసవవానిపాలెంలో కోడిపందేల శిబిరాలపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు రూ.14 వేల నగదు, రెం డు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.

విద్యార్థికి సాయం

మచిలీపట్నం టౌన్ : పెదకరగ్రహారానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పరసా బిందుకు నవకాంతి సంస్థ రూ. 9 వేల ఆర్థిక సాయం అందజేసింది. మణిలాల్, పరూల్, నిర్మలాకెంట్, మాధవీలత, ప్రేమానంద్ పాల్గొన్నారు.